## కేసీఆర్ హయాంలోనే పల్లెల ప్రగతి



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, ఫిబ్రవరి 4 : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల అభివృద్ధి జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని భరంపూర్ గ్రామంలో నిర్వహించిన సర్పంచ్‌ల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర వెల కట్టలేనిదని తెలిపారు. సర్పంచ్ పదవికే విరమణ కానీ ప్రజాసేవకు కాదని అన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజాసేవ చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, మాదూరి రమాకాంత్, రంజిత్‌రెడ్డి, శశికాంత్ యాదవ్, మొట్టె కిరణ్‌కుమార్, వెంకటేశ్, సర్పంచ్ ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయ సంఘాల బాధ్యులు రమేశ్, రామకృష్ణ, రమేశ్ రాథోడ్, రాజేశ్వర్, ముంతాజ్ పాల్గొన్నారు.

# రెండు నెలల్లోనే కాంగ్రెస్‌పై విముఖత

- ఇంద్రవెల్లిలో హంతకులే సంతాపం ప్రకటించడం అనైతికం
- దుష్ప్రచారం, అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వచ్చిండ్రు..
- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

### అదే మా మీద విముఖత రావడానికి తొమ్మిదిన్నరేండ్లు అయింది..



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ సుమన్



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న బాల్కసుమన్, వేదికపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ విఠల్

మంచిర్యాల, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, ప్రజలు ఆరు నెలలకే రోడ్ల మీదకు వచ్చారని, ఇప్పుడు తెలంగాణలో రెండు నెలల్లోనే మేము ఏం అనకపోయినా ప్రజలే మేము ఇంత ఘోరంగా మోసపోతిమి.. ఇట్ల జేస్తరనుకోలేదని కాంగ్రెస్‌ను ఛీత్కరిస్తున్నారని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. దుష్ప్రచారాలతో మా మీద విముఖత వచ్చి మిమ్ములను ప్రతిపక్షంలో కూర్చొపెట్టడానికి తొమ్మిదన్నరేండ్లు పడితే, అదే కాంగ్రెస్‌పై రెండు నెలల్లో విముఖత వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ స్వగృహంలో ఆదివారం నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంద్రవెల్లిలో మారణకాండ సాగించిన కాంగ్రెస్ పార్టీ అక్కడే సభ నిర్వహించడం అనైతికం, దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం.. అంటే ఏం తెస్తారు.. మళ్లీ ఇంద్రవెల్లి కాల్పులు తెస్తారా.. దేశంలో మరోసారి ఎమర్జెన్సీ తెస్తారా.. అదేనా మీరు తెచ్చే ఇందిరమ్మ రాజ్యం అని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ మా ప్రభుత్వాన్ని పడగొడుతారంటా.. వీళ్లు పడగొడుతారంటా.. వాళ్లు పడగొడుతారంటా అని భుజాలు ఎందుకు చరుచుకుంటున్నరో అర్థం కావడం లేదన్నారు. మా పని మాకు మస్తుగా ఉందన్నారు. మీ హామీలను గుర్తు చేసుకుంటా పోవుడే మా పని అని, మిమ్ములను బొంద పెట్టడానికి అవి సరిపోతాయని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీజేపీ ఒక ప్రణాళికతో చేసిన దుష్ప్రచారం, ఇచ్చిన అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడంపై దృష్టి సారించాలని హితువు పలికారు. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యేట్లు పని చేయాలని సూచించారు. ఆ పని పక్కన పెట్టి విపక్ష పార్టీలు, నాయకుల మీద కక్ష సాధించి వెళ్లిపోతామన్నట్లు ప్రజలు అంత అమాయకులు ఏం కాదన్నారు. ఆకలిగున్న ప్రజలకు రెండు, మూడు రోజుల వాయిదా నడుస్తదని, కడుపులో ఎండిన తరువాత వాళ్ల ఆగ్రహం ఎట్లా ఉంటదో మీరే చూస్తారన్నారు. మేం చేయాల్సిన పని మేము చేస్తే చాలు భవిష్యత్‌లో మీరు ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటారని, మీ ప్రభుత్వాన్ని పనిగట్టుకొని పడగొట్టాల్సిన అవసరం మాకు లేదని చురకలు అంటించారు.

#### రైతుబంధు నిధులు మంత్రి ఖాతాలోకి పోయినయ్.. : బాల్క సుమన్

రైతుబంధు కోసం కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్ కంపెనీలోకి, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల బేబుల్లోకి పోయాయని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ మండిపడ్డారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు, అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. డిసెంబర్ 9వ తేదీన చేస్తామన్న రైతు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి పంపిన 65 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సెక్రటేరియట్‌లో నిలిపివేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు ఇలాంటి చిల్లర పనులు చేయలేదన్నారు. చెన్నూర్ నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ నియోజకవర్గానికి నిధులు తెచ్చేందుకు కాకుండా ఆయన కొడుకు కోసం ఎంపీ టికెట్ తీసుకువచ్చేందుకే ఎక్కువగా తిరుగుతున్నాడని మండిపడ్డారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌కు ఇచ్చి, ఎంపీ సీటు వాళ్ల కొడుక్కు ఇస్తే అది కుటుంబ పాలన కాదా జనం ఆలోచించాలన్నారు. నియోజకవర్గంలో 45 వేల ఉద్యోగాలు ఇస్తామని, సింగరేణి కార్మికులకు పన్ను మినహాయింపు ఇస్తామని, క్వార్టర్లు ఖాళీ చేయిస్తామని ఇలా ఆయన ఇచ్చిన హామీలు అమలు చేస్తారో.. లేదో చూద్దామన్నారు. హామీలు అమలు చేస్తారని ఆశగా ఎదురు చూస్తుంటే వివేక్ పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభించుకుంటూ తిరుగుతున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా తాను నియోజకవర్గం వదిలి పోయేది లేదన్నారు. తనపై అసత్య ప్రచారాలు చేశారని ఇప్పుడు అవన్నీ ఏమైపోయాయో జనం ఆలోచించాలన్నారు. వందల కోట్లు ఉన్న వారిని మళ్లీ ఓడించే దాకా చెన్నూర్ విడిచిపెట్టి పోయేది లేదని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా పోరాటం ఆపేది లేదన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా జనం ఇచ్చిన బాధ్యతను వంద శాతం నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు తాను, కేసీఆర్ తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. ఇన్‌చార్జి మంత్రి సీతక్క జై తెలంగాణ అనాల్సిన అవసరం లేదు. అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జైహింద్ అనేది ఇండియా ఎలానో జై తెలంగాణ అనేది తెలంగాణకు అంతే గొప్పదన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నది అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు ఆపే అధికారం ఎవరికీ లేదని, ఒకవేళ ఆపితే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. డీఎమ్‌ఎఫ్‌టీ నిధులు ఆపొద్దని కలెక్టర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమన్నారు. మాజీ మంత్రి బోడ జనార్దన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడడానికి అంతా కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో ఫర్శీలను ఏర్పాటు చేస్తున్న కార్మికులు



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బారికేడ్లు



రంగులు దిద్దుకుంటున్న కోనేరు



మర్రిచెట్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్నానపు గదులు

# ఫటా ఫట్..

### ముమ్మరంగా నాగోబా జాతర ఏర్పాట్లు

- పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు
- వెలుస్తున్న దుకాణాలు, రంగుల రాట్నాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా జాతర(ఫిబ్రవరి 9) ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆయా ప్రభుత్వ శాఖ ల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఉన్నతాధికారులు పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్, బస్టాండ్ ఏర్పాటు స్థలం, గోవాడ్, తైబజార్, పోలీ స్ మైదానాన్ని ట్రాక్టర్ బ్లేడ్‌తో చదును చేయించారు. చెత్తను తొలిగించే పనులు, ఆర్చిగేట్, గోవాడ్, ధర్మశాలలకు రంగులు వేసినట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్లు, శాశ్వత, తాత్కాలిక స్నాన పు గదులు, పది బోర్లకు ప్లాసింగ్, తాగునీటి నల్లాల ఏర్పాటు, పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఏఈ భానుకుమార్ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులకు డీపీవో ద్వారా రూ.7 లక్షలతో ప్రతిపాదనలు పంపించా రు. ఇప్పటికే పంచాయతీరాజ్ ఆధ్వర్యం లో నాగోబా ఆలయ పరిసరాలతోపాటు మర్రిచెట్ల ప్రాంతంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. జాతరలో నిత్యం పారిశుధ్య పనులు చేస్తామని కేస్లాపూర్ జీపీ కార్యదర్శి మహ్మద్ మోతేశాం తెలిపారు. ఇప్పటికే రంగుల రాట్నలతోపాటు వివిధ రకాల దుకాణాలు వెలుస్తున్నాయి.






# ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష



బెల్లంపల్లి సీవోఈలో ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 4: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం సీవోఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 14 పరీక్షా కేంద్రాల్లో 5,918 మంది విద్యార్థులకు గానూ, 5,774 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లిలోని మూడు పరీక్షా కేంద్రాలను రీజినల్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గం ట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 95 శాతం హాజరు నమోదైనట్లు ఆర్సీవో కే స్వరూపారాణి తెలిపారు. బెల్లంపల్లిలోని బాలుర, బాలికల, కాసిపేట పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, స్వరూప, ఊటూరి సంతోష్‌కుమార్ అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, డిపార్ట్‌మెంట్ అధికారులుగా కాసారపు శ్రీధర్, బూర రమేశ్ బాబు, కుమ్మరి మోహన్, రూట్ ఆఫీసర్లుగా దశరథం, ఆనందరెడ్డి వ్యవహరించారు.